అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబర్ 26: మండలంలోని బ్రాహ్మణ్ పల్లి, తొర్లికొండ, పుప్పాల పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణ్‌పల్లి నుంచి గాంధీనగర్ వరకు బీటీ రోడ్డుకు రూ.90లక్షలు, తొర్లికొండ, మనోహరబాద్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.80లక్షలు, పుప్పాలపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు సీఆర్ఆర్ నుంచి మంజూరు అయ్యాయని తెలిపారు. 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి, మాజీ ఎంపీపీలు అనంత్ రెడ్డి, అప్పల రాజన్న, పార్టీ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి, నాయకులు రమణారెడ్డి, చిన్నసాయరెడ్డి, నర్సారెడ్డి, వినోద్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- ధర్పల్లిలో ఆన్‌లైన్ ఎంట్రీ పరిశీలన

డాటా ఎంట్రీని పరిశీస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ధర్పల్లి, నవంబర్ 26: గ్రామాల్లో వంద శాతం కులగణన సర్వే పూర్తయ్యిందని, సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ధర్పల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ చేపడుతున్న సర్వే ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ప్రతి కుటుంబం వివరాలను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలి..

ధర్పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రతిరోజూ పాఠశాలలను పర్యటించి భోజనం తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని ప్రాజెక్టు రామడ్గు గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. కొనుగోళ్లలో ఏమైనా సమస్యలుంటే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ..

కంఠేశ్వర్, నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞ చేయడానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు

వినాయక్‌నగర్,నవంబర్ 26: బాలికను పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై ఐదో టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం ప్రాంతానికి చెందిన ఏజాజ్ ఓ బాలికను పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం మోసం చేయడంతో బాలిక విషయాన్ని కుటుంబీకులకు తెలిపింది. దీంతో వారు ఏజాజ్‌పై ఐదో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

పుట్టిన రోజునే యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, నవంబర్ 26: గూపన్‌పల్లి గ్రామానికి చెందిన ఎమ్.పవన్ (24) తన పుట్టిన రోజునే ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ తెలిపిన మేరకు.. పవన్ ఓ హోటల్‌లో పనిచేసేవాడు. సోమవారం అతడి పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో సరదాగా గడిపాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆత్మహత్యకు కారణం తెలియలేదని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ అందజేత

రుద్రూర్, నవంబర్ 26: రుద్రూర్‌కు చెందిన మౌలు వారం రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేశారు. ఎస్సై సాయన్న బాధితుడికి మంగళవారం అందజేశారు.

పాఠశాలల సందర్శన

పొతంగల్, నవంబర్ 26: మండలంలోని రాంగంగానగర్, టాక్లీ పాఠశాలలను ఎంఈవో ఎల్.శంకర్, ఎంపీవో చందర్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సారంగాపూర్, నవంబర్ 26: మండలంలోని గుండారం జడ్పీ హైస్కూల్ (ఉర్దూ/తెలుగు), ప్రైమరీ స్కూల్‌ను తహసీల్దార్ అనిరుధ్ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం కోసం కేటాయించిన బియ్యాన్ని తనిఖీ చేశారు. బియ్యంలో పురుగులు ఉంటే వాడొద్దని హెడ్‌మాస్టర్లకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు.

అవార్డుల ప్రదానం

ఖలీల్‌వాడి, నవంబర్ 26: ఆర్టీసీలో ఉత్తమ కార్మికులకు ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు ఒకటో డిపోలో మంగళవారం అందజేశారు. ముఖ్యఅతిథిగా కె.జానిరెడ్డి, రీజినల్ మేనేజర్ హాజరై బహుమతులను పంపిణీచేశారు. శంకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరికొండ, నవంబర్ 26: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ దవాఖాన దోపిడీ తారస్థాయికి చేరిందని, ప్రభుత్వం దానిని అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు రమ, ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ జిల్లా అధ్యక్షుడు అనీష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను మండలంలోని గడ్కోల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుష్పలత, లావణ్య, గంగామణి, లక్ష్మి, లతిక, లత, సావిత్రి, అక్షయ్, నర్సయ్య, మణిదీప్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

టాక్లీ, సుద్దులం తండాకు నూతన జీపీలు మంజూరు

లక్ష్మీపూర్ క్యాంప్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పోచారం

రుద్రూర్/ పొతంగల్, నవంబర్ 26: రుద్రూర్, వర్ని, పొతంగల్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. వర్ని మండలం ఇడుపుల తండాలో సీసీ రోడ్డు, రుద్రూర్ మండలం లక్ష్మీపూర్ క్యాంప్‌లో మెటల్ రోడ్డు, పొతంగల్ మండలంలో టాక్లీ నుంచి సాలంపాడ్ వరకు రూ.కోటీ50 లక్షల నిధులతో చేపట్టే మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పొతంగల్ మండలంలోని టాక్లీ, కోటగిరి మండలంలోని సుద్దులం తండాకు నూతన గ్రామ పంచాయతీలు, దోమలెడ్గి చౌరస్తా నుంచి సోంపూర్ మీదుగా హున్సా వరకు బీటీ రోడ్డు మంజూరు అయ్యిందన్నారు. రుద్రూర్‌లోని ఫుడ్ సైన్స్ కాలేజీలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ కల్పనతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తమకు మూడేండ్ల నుంచి స్కాలర్‌షిప్‌లు రావడం లేదని తెలుపగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఫుడ్ సైన్స్ కాలేజీలో సిబ్బంది కొరత ఉన్నదని ప్రిన్సిపాల్ కోరగా.. క్రాంటాక్ట్ బేస్‌లో కొన్ని పోస్టుల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ తారాబాయి, ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారాం, కొనిపూర్ రాజారెడ్డి, కాంగ్రెస్ రుద్రూర్ మండలాధ్యక్షుడు తోట అరుణ్, నాయకులు సంగయ్య, బుజ్జి, పత్తి లక్ష్మణ్, పత్తి రాము తదితరులు పాల్గొన్నారు. పార్టీ పొతంగల్ మండలాధ్యక్షుడు పుప్పాల శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు హనుమంతు, అనిల్ కులకర్ణి, తహసీల్దార్లు గంగాధర్, మల్లయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, ఎంఈవో శంకర్ తదితరులు ఉన్నారు.

శ్రీకాళహస్తిలో పేరిణి నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో పేరిణి నృత్యంలో సర్టిఫికెట్లు అందుకున్న జిల్లా కళాకారిణులు

సుభాష్‌నగర్, నవంబర్ 26: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన సిద్ధార్థ కళాక్షేత్రం విద్యార్థినులు పేరిణి నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు పొందారు. కళాక్షేత్రం నిర్వాహకురాలు జయలక్ష్మీ మాట్లాడుతూ.. ఈనెల 25న కార్తీక సోమవారం పురస్కరించుకొని గంట పాటు శివదేవీ నారాయణ నృత్యాలను ప్రదర్శించినట్లు తెలిపారు. రిద్ధి, మనోజ్ఞ, స్వరజ్ఞ, యుక్త, దాక్షిణి, వైష్ణవి, సిరి, హరిస్మిత, మిథున, ప్రవిక్ష, రిత్విక చేసిన నృత్యాన్ని అభినందిస్తూ ఆలయ నిర్వాహకులు శాలువాలు కప్పి సర్టిఫికెట్లు అందజేశారని వివరించారు.

ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

డిచ్‌పల్లి, నవంబర్ 26: 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రభాకర్ సూచించారు. స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా మంగళవారం డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం వద్ద 2కే రన్ నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, అశ్వక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఏఆర్ఐ భూపతి ప్రభు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ శిక్షణ శిబిరానికి ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరికొండ, నవంబర్ 26: కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లో 'ది డాన్ బోస్కో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో ఈనెల 28 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మేజర్ లీగ్ బేస్‌బాల్ శిక్షణ శిబిరానికి సత్యశోధక్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. డి.శ్రీకాంత్, ఎస్. స్నేహిత్, కె.అజయ్ శిక్షణా శిబిరంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు భూషణ్, శ్రీనివాస్, మాన్‌సింగ్ అభినందించారు.

డిచ్‌పల్లిలో చోరీ

డిచ్‌పల్లి, నవంబర్ 26: డిచ్‌పల్లిలో బస్టాండ్ ఎదురుగా ఉన్న మణికంఠ లక్ష్మీనర్సయ్య ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. లక్ష్మీనర్సయ్య దంపతులు ఊరికి వెళ్లగా.. వారి పెద్ద కుమారుడు పైపోర్షన్‌కు తాళం వేసి కింది పోర్షన్‌లో నిద్రించాడు. గుర్తు తెలియని దుండగులు పై పోర్షన్ గది తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి, గదిలోని రూ.రెండు వేల నగదు, వన్‌ప్లస్ 6 మొబైల్ ఫోన్, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన లక్ష్మీనర్సయ్య కుమారుడు తండ్రికి, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతికి ప్రతీక కళలు

సుభాష్‌నగర్, నవంబర్ 26 : భారతీయ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక కళలని శ్రీ జ్ఞాన సరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ అన్నారు. నగరంలోని సంగీత పాఠశాలలో మంగళవారం కళార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళార్చనతో విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభ వెలుగులోకి వస్తాయని తెలిపారు. అధ్యాపక బృందం స్వప్నరాణి, అనిత, జయప్రద, విద్యార్థులు పాల్గొన్నారు.

గేయమాలిక పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చందూర్, నవంబర్ 26: చందూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కరీంనగర్ వారి ఆధ్వర్యంలో తొలి సంపుటి విజ్ఞాన విపంచిక సైన్స్ గేయమాలిక పుస్తకాన్ని పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి తోటి ఉపాధ్యాయురాలు మంగళవారం ఆవిష్కరించారు. పుస్తకంలో 52 సైన్స్ గేయాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు.

చేపల పెంపకంపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

భీమ్‌గల్, నవంబర్25: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ (మత్స్యకార) ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మండలంలోని మెండోరా గ్రామంలోని ఊర చెరువును మంగళవారం సందర్శించారు. నీటిలో పెరుగుతున్న చేపలు, ప్లవక జీవులను విద్యార్థులు పరిశీలించారు. పలు విషయాలపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. వారివెంట అధ్యాపకులు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి ఉన్నారు.

'ఉపాధి' కూలీలకు సన్మానం

కూలీని సన్మానిస్తున్న అధికారులు

బాల్కొండ, నవంబర్ 26: మన ఊరు పనుల జారత కార్యక్రమంలో భాగంగా జలాల్‌పూర్‌లో వంద రోజులు పూర్తి చేసిన ఉపాధిహామీ కూలీలు, హరితహారంలో పని చేసిన వనసేవక్‌లను మంగళవారం సన్మానించారు. గ్రామపంచాయతీలో రెయిన్ వాటర్ రీస్టోర్‌కు ఇంకుడు గుంత పనులు ప్రారంభించారు. జీపీ కార్యదర్శి దేవేందర్, నాయకులు మోహన్ రెడ్డి, లింబారెడ్డి, ప్రదీప్, అనిల్‌కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, నవంబర్ 26: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నవీపేట ప్రభుత్వ దవాఖానలో ప్రహరీ, కమలాపూర్ శివారులో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. కేజీబీవీలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థినుల స్నానానికి వేడి నీళ్ల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. తాగునీటి సౌకర్యార్థం బోరు పైప్‌లైన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డిప్యూటీ ఈఈలు రాజయ్య, మున్నీ నాయక్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంఈవో అశోక్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి కవిత, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన న్యాయవాదికి అభినందన

మోహన్‌నాయక్‌ను అభినందిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

మోర్తాడ్, నవంబర్ 26: ఆర్మూర్ కోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన గిరిజన న్యాయవాది మోహన్‌నాయక్‌ను మంగళవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పొడేటి శంకర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా 'రాజ్యాంగ దినోత్సవం'

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నవీపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తేతెలంగాణ యంత్రాంగ, నవంబర్ 26: భారత రాజ్యాంగ 75వ దినోత్సవాన్ని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. రాజ్యాంగ విశిష్టత, ఆవశ్యకతను గుర్తు చేసుకున్నారు. రాజ్యాంగ పీఠికలోని ప్రధాన అంశాలను అధ్యయనం చేయాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో..

కోటగిరిలో..

సిరికొండలో..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నవీపేట, నవంబర్ 26: కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బినోలా స్టోన్ క్రషర్‌లో మెస్సర్స్ జియో టెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పలువురి అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కెప్టెన్ సుధాకర్‌రెడ్డి లీజుకు తీసుకొని క్రషర్‌తోపాటు వివిధ రకాల చెట్లను పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుతున్నాడని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

దరఖాస్తులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ

బోధన్ రూరల్, నవంబర్ 26: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలనే లక్ష్యంతో విద్యుత్ వినియోగదారుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. బోధన్ పట్టణంలోని ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోదారుల సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ఎనిమిది మంది వినియోగదారుల ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ మెంబర్లు సలంద రామకృష్ణ(టెక్నికల్), లకావత్ కిషన్(ఫైనాన్స్), ఫోర్త్ మెంబర్ మర్రి పల్లి రాజాగౌడ్, బోధన్ డీఈ ముక్తార్, బోధన్ రూరల్ ఏఈ మారుతి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్, నవంబర్26: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 21 తేదీ నుంచి డిసెంబర్ 21 వరకు నిర్వహిస్తున్న వేసెక్టమీ మాసోత్సవాలను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఏరియా దవాఖానలో మంగళవారం డివిజన్ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వేసెక్టమీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఒకటిన మాలల సింహగర్జన

నందిపేట్, నవంబర్ 26:మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాలల సింహగర్జన పోస్టర్లను మాల సంఘాల జేఏసీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు ప్రతి గ్రామం నుంచి మాలలు తరలిరావాలని కోరారు. మాల సంఘాల జేఏసీ నాయకులు కోమన్‌పల్లి రాజన్న, బొర్రోల్ల సురేశ్, నాగరాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, నవంబర్26: మండలంలోని చేపూర్ ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి(50) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించామని పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా సంబంధీకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

ఎడపల్లి, నవంబర్26: మండలంలోని జమ్లంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జమలం గ్రామానికి చెందిన సాయిలు(52) భార్య మీనా జ్యోతి ఆరోగ్యం బాగలేదు. మెంట్రాజ్ పల్లిలోని ఆమె చెల్లెలు మంజుల ఇంటి వద్ద ఆమె ఉంటోంది. భార్య ఆరోగ్యం కుదుటపడకపోవడంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్క దాడి.. ఒకరికి గాయాలు

ఎడపల్లి, నవంబర్ 26: మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 15 రోజుల క్రితం ఇదే గ్రామంలో ఓ మహిళపై కుక్క దాడి చేసింది. వరుసగా కుక్కలు దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడద నివారణకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది.